ముషీరాబాద్‌షా ముఠా గోపాల్

ఉత్కంఠ భరిత పోరులో ముఠా గోపాల్ ఘన విజయం

- రెండో స్థానం కోసం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల పోటాపోటీ
- గతం కంటే ఎక్కువ మెజారిటీ



ముషీరాబాద్: ఉత్కంఠ భరితంగా సాగిన ముషీరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ ఘన విజయం సాధించారు. ముఠా గోపాల్‌కు 75,207 ఓట్లు రాగా సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌కు 37,410 ఓట్లు వచ్చాయి. ఇక తృతీయ స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి పూస రాజుకు 35,423 ఓట్లు లభించాయి. ముఠా గోపాల్ 37,797 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ముఠా గోపాల్ 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నుంచి పోటీ చేసి డాక్టర్ కె.లక్ష్మణ్ చేతిలో ఓటమి చెందారు. 2018లో రెండోసారి పోటీ చేసి 36,910 ఓట్ల మెజార్టీతో మొదటిసారి విజయం సాధించారు. ప్రస్తుతం 2023 ఎన్నికల్లో రెండవసారి ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు.

31 మంది అభ్యర్థుల పోటీ...

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 31 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. బీఎస్పీ అభ్యర్థి పి.నరేందర్‌కు 617 ఓట్లు రాగా సీపీఎం అభ్యర్థి ఎం.దశరథ్‌కు 835 ఓట్లు లభించాయి. ఇక స్వతంత్ర అభ్యర్థులు, చిన్న చిన్న పార్టీల వారు కూడా పోటీ చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. వారెవరికీ 200 ఓట్లు మించకపోవడం గమనార్హం.

రెండవ స్థానం కోసం కాంగ్రెస్, బీజేపీ పోటీ

మొదటి రౌండ్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ 1500 నుంచి 2000 ఓట్లు సాధిస్తూ రౌండ్ రౌండ్‌కు తన మెజార్టీ పెంచుకుంటూ దూసుకుపోతుండగా రెండవ స్థానం కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీపడ్డారు. కొన్ని రౌండ్లు బీజేపీ అభ్యర్థి పూస రాజు మెజార్టీ సాధిస్తుండగా కొన్ని రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ ముందంజలో ఉంటూ వచ్చారు. చివరి వరకు ఇదే పోరు కొనసాగి 21వ రౌండ్ వరకు అంజన్‌కుమార్‌యాదవ్ పూస రాజు కంటే 1967 ఓట్లు అధికంగా సాధించి రెండవస్థానంలో నిలిచారు.

భోలక్‌పూర్‌లోనూ బీఆర్ఎస్‌దే హవా...

మొదట గాంధీనగర్, కవాడిగూడ డివిజన్‌లలో ఆరు రౌండ్లు పూర్తి అయ్యేటప్పటికి ముఠా గోపాల్ 5 వేల పైచిలుకు మెజార్టీతో ఉన్నారు. భోలక్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీకి వన్‌సైడ్‌గా ఓట్లు పడతాయని భావించడంతో ఆ రౌండ్ కోసం కాంగ్రెస్ నేతలు వేచి చూస్తుండగా బీఆర్ఎస్ నేతల్లో ఒకింత ఆందోళన వ్యక్తం అయింది. అయినప్పటికీ భోలక్‌పూర్ డివిజన్‌లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ వెనుతిరగకుండా ప్రతి రౌండ్‌లోనూ, ప్రతి బూత్‌లోనూ మెజార్టీ సాధించి భోలక్‌పూర్ డివిజన్ పూర్తి అయ్యేసమయానికి 11 వేల పైచిలుకు మెజార్టీని సాధించి తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించారు.



రిటర్నింగ్ అధికారి నుంచి ఎమ్మెల్యే అధికారిక లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పత్రాన్ని స్వీకరిస్తున్న ముఠా గోపాల్

పోస్టల్ బ్యాలెట్లలో అంజన్‌కు మెజార్టీ...

సాధారణ పోలింగ్‌కు భిన్నంగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో అంజన్‌కుమార్‌యాదవ్ మెజార్టీని సాధించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్లు 777 ఉండగా అందులో 60 బ్యాలెట్లు చెల్లలేదు. ఇక 717 బ్యాలెట్లలో బీఆర్ఎస్ 207, కాంగ్రెస్‌కు 301, బీజేపీకి 177, బీఎస్పీకి 8, సిపిఎంకు ఆరు, నోటాకు 12తో పాటు కొంత మంది స్వతంత్ర అభ్యర్థులకు ఒకొక్కటి చొప్పున పోల్ అయ్యాయి. 94 ఓట్లు కాంగ్రెస్ పార్టీకి అధికంగా వచ్చాయి.

గతం కంటే ముఠా గోపాల్‌కు పెరిగిన మెజారిటీ

2018లో ముఠా గోపాల్‌కు 72,997 ఓట్లు రాగా ప్రస్తుతం 75,207 ఓట్లు వచ్చాయి. గతం కంటే 2204 ఓట్లు ఈ సారి అధికంగా పోల్ అయ్యాయి. మెజార్టీ కూడా గతంలో 36,910 ఓట్ల మెజార్టీ రాగా ప్రస్తుతం 37,797 ఓట్లు అంటే 887 ఓట్లు అధికంగా వచ్చాయి. ఇక 2018లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు 36,087 ఓట్లు రాగా ప్రస్తుతం ఆయన తండ్రి అంజన్‌కుమార్‌యాదవ్‌కు 37,410 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి డాక్టర్ కె.లక్ష్మణ్‌కు 2018లో 30,813 ఓట్లు రాగా, ప్రస్తుత అభ్యర్థి పూస రాజుకు 35,423 ఓట్లు రావడం గమనార్హం.

విజయానందం



కౌంటింగ్ కేంద్రం వద్ద పార్టీ నేతల సంబరాలు



నాయకులతో కలిసి విజయ సంకేతం చూపిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ రెండవసారి ఘన విజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు దోమలగూడలోని ఏవీ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని సంబరాలు జరుపుకున్నారు. రంగులు చల్లుకుంటూ ఒకరినొకరు అభినందించుకుంటూ బీఆర్ఎస్ జెండాను ఎగరవేస్తు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ జై బీఆర్ఎస్, జై ముఠా గోపాల్ అంటూ నినాదాలు చేస్తూ కేరింతలు కొట్టారు.



ముఠా జైసింహను ఎతుకొని సంబరాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కుటుంబసభ్యులతో కలిసి ధృవీకరణ పత్రం అందుకున్న కాలేరు



అంబర్‌పేట్: ఓట్ల లెక్కింపు అనంతరం విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు అంబర్‌పేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపర్ణ ధృవీకరణ పత్రం అందించారు. ఆదివారం నారాయణగూడ రెడ్డి మహిళా కళాశాలలో ధృవీకరణ పత్రాన్ని ఆర్ఓ కాలేరు వెంకటేష్‌కు అందించారు. ధృవీకరణ ప్రతాన్ని భార్య కాలేరు పద్మ, కుమారుడు కాలేరు మణికంఠ్, కుమార్తె డాక్టర్ దీప్తితో కలిసి అందుకున్నారు.

కాలేరుకు హారతులతో స్వాగతం



నల్లకుంట: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేష్ సమీప బీజేపీ అభ్యర్థిపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఆదివారం సాయంత్రం నల్లకుంటలో ఎమ్మెల్యే కాలేరు కృతజ్ఞతా పాదయాత్రచేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ఆడుగడుగునా మహిళలు హారతులతో కాలేరుకు శుభాకాంక్షలు తెలియజేశారు. తన గెలుపు కోసం కృషి చేసిన ఓటర్లందరికీ పేరుపేరున కాలేరు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీఆర్ఎస్ నాయకులు వన్నాడి రమ్య తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట్‌లో గులాబీ జెండా రెపరెపలు

- 24,537 ఓట్ల మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు గెలుపు
- 18 రౌండ్లలో 15 రౌండ్లు బీఆర్ఎస్‌దే హవా
- పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్ పార్టీ



ఓట్ల లెక్కింపు కేంద్రం

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో గులాబీ జెండా మరోసారి రెపరెపలాడింది. భారీ మెజారిటీతో తిరిగి బీఆర్ఎస్ పార్టీ తన స్థానాన్ని పదిల పరుచుకుంది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాలేరు వెంకటేష్ భారీ మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి బీజేపీ కృష్ణ యాదవ్‌పై విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచే బీఆర్ఎస్ పార్టీ ఆధిక్యన్ని ప్రదర్శిస్తూ వచ్చింది. మొత్తం 18 రౌండ్లలో 3 రౌండ్లు మినహా 15 రౌండ్లలో బీఆర్ఎస్ ఆధిపత్యం ప్రదర్శించింది.

రౌండ్	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్
1	3842	3357	1338
2	3939	2508	1356
3	4869	2705	1152
4	3829	2523	906
5	4271	2957	1161
6	3354	2966	1161
7	3698	3072	1097
8	4759	1792	840
9	5751	1674	1107
10	5474	2004	936
11	4896	2351	928
12	5115	2196	903
13	4495	2660	861
14	5624	2896	1060
15	3810	4796	816
16	2918	5120	761
17	2984	3513	1154
18	507	415	134

పోస్టల్ బ్యాలెట్	బీఆర్ఎస్ 279
	బీజేపీ 370
	కాంగ్రెస్ 322
నోటా	1317

- నియోజకవర్గంలో 2,77,103 ఓట్లు ఉండగా 1,45,470 ఓటు పోలయ్యాయి. ఇందులో బీఆర్ఎస్‌కు 74,416 ఓట్లు పోలయ్యాయి. బీజేపీకి 49,879 ఓట్లు వచ్చాయి. అలాగే కాంగ్రెస్‌కు 18,004 పోలాయ్యాయి. మిగిలిన ఓట్లు ఇతరులకు వచ్చాయి.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

నల్లకుంట: టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ దాటి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ సాధించింది. దీంతో నల్లకుంటలో ఆ పార్టీ నేతలు బాణా సంచాలు కాల్చి, మిఠాయిలు పంచుతూ విజయోత్సవాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతల ధనార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో న్యూనల్లకుంటలో పార్టీ కార్యకర్తలు బాణా సంచాలు కాల్చి ప్రజలకు మిఠాయిలు తినిపించి సంబురాలు జరుపుకున్నారు. అలాగే తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక రత్నానగర్ బస్తీలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. ఈ సంబురాల్లో రత్నానగర్ బస్తీ అధ్యక్షుడు పి.ఈశ్వర్, కాంగ్రెస్ నాయకులు షబ్బీర్, కుతాడి రవి కుమార్, నర్సింగ్ రావు, లాలయ్యగౌడ్, సత్తయ్య, బత్తిని వెంకటేష్, హైమద్, రంగారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



రత్నానగర్‌లో..

ఈ విజయం ప్రజలకు అంకితం



కార్యకర్తల సంబరాల్లో కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: తన గెలుపును ప్రజలకు అంకితం అని ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడగానే నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రెండవసారి భారీ మెజార్టీతో గెలిపించిన అంబర్‌పేట ప్రజలకు నియోజకవర్గానికి మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమానికి తోడ్పాటును అందిస్తామన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించగానే కాలేరు వెంకటేష్‌కు నియోజకవర్గం ప్రజలతో పాటు సన్నిహితులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి నాయకులు విచ్చేసి సంబరాలు చేశారు.

ముఠా గోపాల్ గెలుపుపై హర్షం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలో ముఠా గోపాల్ భారీ మెజారిటీతో గెలవడం పట్ల పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తు సంబరాలు నిర్వహించారు. రాంనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు వెంకట కృష్ణారావు(బబ్లు) ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాల నుంచి క్లైవెన్ బేకరీ మీదుగా సుందరయ్య పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఏ.కిషన్‌రావు, ఆర్.వివేక్, సంతోష్‌గౌడ్, రాజు, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారికి నిరుద్యోగుల నివాళి

చిక్కడపల్లి: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కాసోజు శ్రీకాంతాచారి కీలకపాత్ర పోషించారని నిరుద్యోగ అభ్యర్థులు నివాళులర్పించారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థులుబి.సురేష్, అక్షయ్, శ్రీనివాస్, వినయ్, రాజేందర్, పరుశురామ్, గిరి, శివ, నవీన్‌చారి పాల్గొన్నారు.

నేడు ఘంటసాల శతాబ్ది జయంతి

చిక్కడపల్లి: మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శతాబ్ది జయంతి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భలే మంచి రోజు పేరిట ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు 12గంటలు నిరాటంకంగా రామ సుబ్రమణ్యం శ్రీధరం సారథ్యంలో ప్రముఖ గాయనీ గాయకుల సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు గాయకుడు కోమరవోలు శ్రీనివాస్‌రావుకు ఘంటసాల స్మారక జీవిత సాఫల్యపురస్కారం ముఖ్యఅతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ ప్రదానం చేస్తారని తెలిపారు.

పట్టుబడ్డ డబ్బు ఎవరిదో తేల్చాలి

కవాడిగూడ: గత నెల 28న ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టుబడ్డ నగదు ఎవరిదో తేల్చాలని ముషీరాబాద్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ముషీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం స్వతంత్ర అభ్యర్థి కరుణం రాజేష్ కుమార్ మాట్లాడుతూ.... ముషీరాబాద్ పోలీసులు నగదు సీజ్ చేసిన తరువాత ఎఫ్ఐఆర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు కేసు నమోదు చేశారని, ఆ నగదు ఎవరిదో తేల్చేంతవరకు ముషీరాబాద్ ఎన్నికల ఫలితాన్ని హోల్డ్‌లో ఉంచాల్సిందిగా ముషీరాబాద్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నల్లకుంటలో బీఆర్ఎస్ సంబురాలు



నల్లకుంట: అంబర్‌పేట నియోజక వర్గం బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ భారీ మెజారిటీతో గెలుపొందారు. దీంతో ఆ పార్టీ నేతలు నల్లకుంటలో సంబురాలు జరుపుకున్నారు. మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఆధ్వర్యంలో స్థానిక ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద బాణాసంచా కాలి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సంబురాల్లో బీఆర్ఎస్ నాయకులు రమణానాయుడు, ఇర్ఫానా సుల్తానా, వన్నాడి రమ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



కాచిగూడ: కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్ట్స్‌తో పాటు సర్టిఫికెట్లను సాముురాయ్ ప్రొఫెషనల్ కరాటే మాస్టర్ సిద్ధార్థ్ షా ప్రధానం చేశారు. అదివారం నారాయణగూడలో కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వైస్ చైర్మన్ ప్రార్థన మణికొండ, కరాటే మాస్టర్స్ నాగరాజు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

18న వీరభద్ర స్వామి కల్యాణోత్సవం



దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న వినోద్

కాచిగూడ: శ్రీ వీరభద్ర స్వామి కల్యాణాన్ని ఈనెల 18న కర్మన్‌ఘాట్‌లోని ఏపీఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

మిఠాయిల పంపిణీ

చిక్కడపల్లి: బీఆర్ఎస్ కుటుంబ, అవినీతి, నిర్లక్ష్య పాలనకు విసుగు చెందిన ప్రజలు మార్పును కోరుతూ కాంగ్రెస్‌కు పట్టం కట్టా రని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ ఎస్తేర్‌రాణి అన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల ఆదివారం ఆమె గోల్కొండ క్రాస్ రోడ్డులో సంబురాలు నిర్వహించి..మిఠాయిలు పంచిపెట్టారు.



పోలీసుల అత్యుత్సాహం..సామాన్యుల అవస్థలు



నారాయణగూడ రెడ్డి మహిళా కళాశాల వద్ద గల్లీ వాసులకు బయటకు వెళ్లడానికి అనుమతించని పోలీస్ సిబ్బంది

అంబర్‌పేట్: ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పరిసరాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం అంబర్‌పేట నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కేంద్రం ఉన్న రెడ్డి కళాశాల పరిసర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడ్డారు. నారాయణగూడలోని రెడ్డి కళాశాల సమీప ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్, గల్లీ వాసులు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలీస్ దిగ్బంధానికి గురయ్యారు. అపార్ట్‌మెంట్ వాసులు కనీసం మంచినీళ్లు తెచ్చుకోవడానికి సైతం ద్విచక్ర వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. ఆదివారం కనీస అవసరాలు తీర్చుకోవడానికి సైతం పోలీసులు చూపిన అత్యుత్సాహంతో సామాన్యులు ఇక్కట్లు పాలయ్యారు. తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలో అంతుబట్టక తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు.